సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 9 । అక్టోబర్ । 2025



ఇంతింతై.. వనమంతై !
ప్రభుత్వ ప్రోత్సాహం, వాతావరణ అనుకూలతతో ఆయిల్ పామ్ విస్తీర్ణం ఉమ్మడి జిల్లాలో ఏటేటా పెరుగుతోంది. 8లో



అధికంగా వర్షపాతం, పంటలు..
జిల్లాలో వానాకాలం సీజన్‌లో అధిక వర్ష పాతం నమోదైంది. పంటలూ సాధారణం కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యాయి. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
31° / 23°
జిల్లాలో గురువారం వాతావరణం చల్లగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారి నిత్యకల్యాణం బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో ఎమ్మెల్యే కోరం కనకయ్య, నాయకులు

ఇల్లెందు: స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎంను కలవగా, ఇల్లెందు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిచేలా చూడాలని సూచనలు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరం సురేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, శ్రీనివాస రెడ్డి, గణేష్, సర్దార్, రాము తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమా నాయక్ తదితరులు

అశ్వారావుపేటరూరల్: ప్లాంటేషన్ నిర్వహణ, మొక్కల పెంపకంపై జాగ్రత్తలు పాటించాలని, సంరక్షణలో నిర్లక్ష్యం చేయొద్దని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్ అన్నారు. బుధవారం ఆయన అశ్వారావుపేట ఫారెస్టు రేంజ్ పరిధిలో పర్యటించారు. మండలంలోని ఊట్లపల్లి సమీపంలో అటవీ శాఖ ద్వారా 50 ఎకరాల్లో పెంచుతున్న ప్లాంటేషన్‌ను సందర్శించి మొక్కలను పరిశీలించారు. అనంతరం అశ్వారావుపేటలో నూతనంగా నిర్మిస్తున్న ఫారెస్టు గెస్ట్ హౌస్ భవనాన్ని పరిశీలించి నిర్మాణాన్ని మరింత వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ కృష్ణాగౌడ్, ఎఫ్‌డీఓ దామోదర రెడ్డి, ఫారెస్టు రేంజర్ మురళి, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.


పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా

పాల్వంచ: పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సంక్షేమాధికారి జె.స్వర్ణలత లెనినా అన్నారు. బుధవారం పాల్వంచ ప్రాజెక్ట్ పరిధిలోని షిరిడీ సాయినగర్‌లో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, పాఠశాలలో కిశోర బాలికలకు 'మీరు తీసుకునే ఆహారం, మీ పెరుగుదల'అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సరైన సమయంలో సరైన పద్ధతిలో అత్యధిక పౌష్టిక విలువలు ఉన్న ఆహారం తీసుకుంటే ఆరోగ్య వంతులుగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మైథిలి, సీడీపీఓ ప్రసన్నలక్ష్మి, సూపర్‌వైజర్ రమాదేవి, శారద, అశోక కుమారి, జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్ రాము, కోఆర్డినేటర్ సోనీ, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమరానికి సై



23న తొలిదశలో 11 మండలాల్లో పరిషత్ ఎన్నికలు

- నేటి నుంచి మూడురోజులపాటు నామినేషన్ల స్వీకరణ
- మొదటి విడతలో 113 ఎంపీటీసీలు, 11 జెడ్పీటీసీలకు పోలింగ్
- ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

చుంచుపల్లి: జిల్లా, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల తొలి విడతలో ఎన్నికలు జరిగే స్థానాలకు గురువారం నోటిఫికేషన్ వెలువడనుంది. మొదటి విడతలో 113 ఎంపీటీసీలు, 11 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. గురువారం నుంచి ఈ నెల 11 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తారు. 12న నామినేషన్ల పరిశీలన, 13,14 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, 15న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. ఈ నెల 23న పోలింగ్ నిర్వహించిన తర్వాత నవంబర్ 11న తుది ఫలితాలను ప్రకటిస్తారు. మొదటి దశలో ఎన్నికలు జరిగే పదకొండు మండలాల్లో జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నామినేషన్ సందర్భంగా జెడ్పీటీసీ స్థానంలో పోటీచేసే జనరల్ అభ్యర్థులు రూ.5వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.2,500 డిపాజిట్ చెల్లించాలి. ఎంపీటీసీ స్థానాలకు జనరల్ అభ్యర్థులు రూ.2,500, ఎస్సీ,ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1,250 చెల్లించాలనే నిబంధనలు ఉన్నాయి. జెడ్పీటీసీ అభ్యర్థులు రూ.4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులు రూ.1.50 లక్షల చొప్పున ఖర్చు పెట్టేలా ఎన్నికల సంఘం పరిమితిని విధించింది. జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియలో 11 మంది రిటర్నింగ్ అధికారులు, ఎంపీటీసీలకు సంబంధించి 39 మంది రిటర్నింగ్ అధికారులు, 39 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు విధులు నిర్వర్తించనున్నారు.

తొలి విడత ఎన్నికలు జరిగే ఎంపీటీసీలు, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

మండలం	ఎంపీటీసీలు	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
అశ్వాపురం	12	65	33,347
భద్రాచలం	14	60	40,761
బూర్గంపాడు	17	89	50,351
చర్ల	12	67	32,653
దుమ్ముగూడెం	13	73	36,762
కరకగూడెం	5	26	12,869
మణుగూరు	11	60	36,480
పినపాక	9	55	27,350
ఆళ్లపల్లి	5	21	9,314
గుండాల	5	25	13,330
జూలూరుపాడు	10	61	27,985

3,21,202 మంది ఓటర్లు

జిల్లాలోని 233 ఎంపీటీసీలు, 22 జెడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 23, 27 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరపనున్నారు. తొలివిడతలో ఎన్నికలు నిర్వహించే 11 జెడ్పీటీసీ స్థానాలు, 113 ఎంపీటీసీ స్థానాల పరిధిలో 602 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా స్థానాలకు ఇప్పటికే రిజర్వేషన్లు ప్రకటించిన విషయం విదితమే. ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు, సిబ్బందిని కేటాయింపు వంటివి పూర్తి చేశారు. మొదటి విడత ఎన్నికల్లో 3,21,202 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



మండలాలకు తరలుతున్న బ్యాలెట్ బాక్సులు

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు



జిల్లాలో మొదటి విడతలో ఎన్నికలు జరిగే 113 ఎంపీటీసీ, 11 జెడ్పీటీసీ స్థానాలకు గురువారం నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశాం. ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్లను ఆయా మండల కేంద్రాల్లోనే ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్వోలు స్వీకరిస్తారు. నామినేషన్లు సమయంలో అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో పూర్తి విషయాలను పొందుపరచాలి.

–బి.నాగలక్ష్మి, అదనపు ఎన్నికల అధికారి

బాంబుల భయం!



భద్రాచలంలో స్వాధీనం చేసుకున్న బాణసంచాతో పోలీసులు(ఫైల్)

- నివాస ప్రాంతాల్లో అక్రమంగా బాణసంచా నిల్వలు
- నిబంధనలు, జాగ్రత్తలు పాటించని కొందరు వ్యాపారులు
- అక్రమ నిల్వలపై భద్రాచలంలో టాస్క్‌ఫోర్స్ దాడులు
- జిల్లావ్యాప్తంగా టపాసుల అక్రమ నిల్వలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మధ్యనే పెద్ద ఎత్తున బాణసంచా నిల్వ చేస్తున్న గోదాంలపై మంగళవారం భద్రాచలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. జనావాసాల నడుమ ఇరుకు ప్రదేశంలో ఐదు నుంచి పది లక్షల రూపాయల విలువైన బాణసంచా ఉన్నట్టు గుర్తించి, కేసు నమోదు చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా అక్రమంగా బాణసంచా నిల్వ చేయడం ఒక్క భద్రాచలంలోనే కాదు జిల్లా అంతటా జరుగుతోంది. అయినా పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ యంత్రాంగాలు ఈ వ్యవహారం పట్ల చూసీచూడనట్టుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

ఐదు కేజీలకు మించితే..

దీపావళి పర్వదినం సందర్భంగా కుటుంబ సమేతంగా బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటారు. ఒక ఇంట్లో మొత్తంగా ఐదు కేజీల బరువైన బాణసంచా నిల్వ చేసుకునేందుకు ఎటువంటి అనుమతులు అక్కర్లేదు. అంతకు మించితే కచ్చితంగా పోలీసులు, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. బాణసంచాలో ఉపయోగించే పేలుడు పదార్థాలకు పొరపాటున నిప్పు రాజుకుంటే పెను ప్రమాదం జరిగి, క్షణాల్లో ఆ ఇంటిని దాని చుట్టు పక్కల ఉన్న ప్రాంతాలను చుట్టుముడుతుంది. తేరుకునేలోపే కోలుకోలేని విధంగా నష్టపోవాల్సి వస్తుంది. అందువల్లే బాణసంచా అమ్మకాలు, నిల్వ చేయడంపై కఠినమైన ఆంక్షలను చట్టాల రూపంలో ప్రభుత్వాలు అమల్లోకి తెచ్చాయి.

నిబంధనలు ఇలా..

బ్రిటీష్‌కాలం నుంచి బాణసంచా నిల్వ చేయడంపై చట్టాలు ఉన్నాయి. ఇవి అనేక మార్పులకు లోనవుతూ చివరిసారిగా 2012లో కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. బాణసంచా నిల్వ చేసే ప్రదేశం (షాపు, గోదాం) దగ్గర 5 కేజీల సామర్థ్యం కలిగిన రెండు అగ్నిని ఆర్పే పరికరాలు తప్పనిసరిగా ఉండాలి. ఇంటి పైకప్పు పైన వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్, దిగువ భాగంలో 450 లీటర్ల సామర్థ్యం కలిగిన నీళ్ల ట్యాంకు ఉండాలి. నాణ్యత కలిగిన కరెంటు వైర్లను ఉపయోగించాలి. ఇటుకలు, కాంక్రీట్, జీఐషీట్స్ వంటి అంటుకునే స్వభావం లేని వస్తువులతోనే బాణసంచా నిల్వ చేసే గదులు/గోదాంలను నిర్మించాలి. ఈ గదుల దగ్గర మండే స్వభావం కలిగిన కలప, బట్టలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఉండకూడదు. ఈ బాణసంచా నిల్వ చేసే గదులు/గోదాంలు రోడ్డు నుంచి కనీసం మూడు కిలోమీటర్ల లోపలికి ఉండాలి. వీటి చుట్టూ 15 మీటర్ల వరకు మరే ఇతర నిర్మాణాల ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇళ్ల మధ్యనే నిల్వలు

దీపావళి సంబరాలను సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. అప్పటికే తమ రెగ్యులర్ వ్యాపారాలకు ఉపయోగించే పని ప్రదేశాల(షాపులు, గోదాంలు)లోనే బాణసంచా కూడా నిల్వ చేస్తున్నారు. పేలే స్వభావంలేని సాధారణ వస్తువులు నిల్వ చేసేందుకు ఉపయోగించే ప్రదేశాలు ఇళ్ల మధ్యన, కిక్కిరిసిన మార్కెట్ ఏరియాల్లోనే ఉన్నాయి. ఇలాంటి ప్రదేశాల్లోనే యథేచ్ఛగా బాణసంచా నిల్వ చేస్తున్నారు. కేవలం దీపావళికి వారం రోజులపాటు జరిగే వ్యాపారం కోసం రక్షణ నిబంధనలు అమలు చేయడం అనవసర ఖర్చు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కేవలం లాభాల పైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

గుణపాఠం నేర్చుకోకుంటే..

ఏపీలోని కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ నిల్వ కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో ఏడుగురు మరణించినట్లు సమాచారం. అంతకుముందు 2018లో వరంగల్‌లో చోటు చేసుకున్న ప్రమాదంలో ఘటన స్థలిలోనే పది మంది కార్మికులు మాడిమసై పోయారు. పేలుడు తీవ్రతకు చుట్టు పక్కల ఇళ్లు దెబ్బతిన్నాయి. గోడలు, ఇంటి పైకప్పు ఊడిపోయి ఇళ్లలో ఉన్నవారిపై పడి గాయాలయ్యాయి. ప్రమాదాలు చెప్పి రావు, అవి చోటు చేసుకునే అవకాశం ఉన్నప్పుడు తప్పనిసరిగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ లాభాలే ధ్యేయంగా కొందరు వ్యాపారులు వ్యవహరిస్తున్న తీరు ప్రమాదాలకు ఆహ్వానంగా మారుతోంది. దీపావళి పండుగ రాకముందే బాణసంచా, టపాకాయలను భారీ ఎత్తున ఇళ్ల మధ్యన నిల్వ చేస్తున్నారు. ఈ క్రమంలో అనుమతుల సంగతి మొత్తానికే పక్కన పెట్టడంతో పాటు ఇరుగుపొరుగు వారిని ప్రమాదంలోకి నెడుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేయడం నేరం. విక్రయాలకు కూడా అధికారుల అనుమతులతోనే చేపట్టాలి. అక్రమ నిల్వలను గుర్తించేందుకు భద్రాచలంలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. అనుమతులు లేకుండా నిల్వ చేసినట్లు గుర్తిస్తే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా ఎక్కడైనా బాణసంచా అక్రమంగా నిల్వచేసినా, విక్రయిస్తున్నా డయల్ 100తో పాటు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– విక్రాంత్ కుమార్ సింగ్, ఏఎస్పీ, భద్రాచలం

అక్షర జ్ఞానం కోసం..

రోజూ ఐదు కిలోమీటర్ల దూరం నడుస్తున్న గొత్తికోయ చిన్నారులు



అడవి మార్గంలో కాలినడకన పాఠశాలకు వస్తున్న వలస గొత్తికోయ చిన్నారులు

అశ్వారావుపేటరూరల్: వలస గొత్తికోయ చిన్నారులు 'అక్షర' సేద్యానికి 'నడక'యాతన పడుతున్నారు. అడవి, పంట పొలాల మధ్య నుంచి రోజూ కాలినడకన సర్కారు బడికి రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న రమణక్కపేట గొత్తికోయల కాలనీకి చెందిన 8 మంది బడిఈడు పిల్లలు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంటిమడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది జూన్‌లో చేరారు. వీరి వయసు పదేళ్లలోపే ఉన్నప్పటికీ రోజూ ఐదు కిలోమీటర్లు నడుస్తున్నారు. వలస గొత్తికోయలు ఇరవై ఏళ్లుగా అడవిలోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నా, ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలు లేవు. పాఠశాలలో కొత్తగా విధుల్లోచేరిన టీచర్ శ్రుతి ప్రత్యేకదృష్టి పెట్టి చిన్నారులను బడి బాట పట్టించారు. కాగా, ప్రభుత్వం, దాతలు స్పందించి చిన్నారులకు వాహన సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

నేడు పెద్దమ్మతల్లి ఆలయ హుండీ లెక్కింపు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని శ్రీకనక దుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో మే 5 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను గురువారం లెక్కించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్.రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపు ప్రక్రియ శివాలయంలోని ఉచిత శ్రీ శ్రీనివాస కల్యాణ మండపంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి.పాటిల్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్థానిక సంస్థల ఎన్నికల విధులను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారులు బాధ్యతగా, సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంసీసీ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ కేంద్రాల వివరాలను పోలీస్ అధికారులకు అందించాలని సూచించారు. ఎంపీడీఓలు కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని, అభ్యర్థులు నామినేషన్ ఫారాలను ముందుగానే తనిఖీ చేసుకునే సౌకర్యం కల్పించాలని సూచించారు. స్వీకరించిన నామినేషన్లను అదే రోజు టీ-పోల్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, రోజువారీ నివేదికలు అందజేయాలని వివరించారు. తహసీల్దార్లు (మండల ఎంసీసీ నోడల్ అధికారులు) ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాల నివేదికలను సేకరించి జిల్లా నోడల్ అధికారులకు పంపాలని సూచించారు. జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ సంబంధిత ఆర్డీఓ/సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో కొనసాగుతుందన్నారు. తుది అభ్యర్థుల జాబితా ప్రకటించిన తర్వాత బ్యాలెట్ పేపర్ తయారీ, ముద్రణను తెలుగు వర్ణమాల క్రమంలో నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ సామగ్రిని కేంద్రాల వారీగా వేరు చేసి భద్రంగా ఉంచాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ర్యాలీలు, సమావేశాలు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి ఎస్‌హెచ్ఓ/సీఐల నుంచి అనుమతులు పొందాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ఈ నెల 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. 12న నామినేషన్ల పరిశీలన, 13న అప్పీల్ స్వీకరణ, 14న అప్పీల్ విచారణ జరుగుతాయన్నారు. 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు ఉంటుందని, అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారని వివరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి సాధించేలా..



రచ్చబండలో సమస్యలను తెలుసుకుంటున్న పీఓ, ఇతర అధికారులు(ఫైల్)

- గిరిజన గ్రామాల సమగ్రాభివృద్ధికి ఆది కర్మయోగి పథకం
- ఉమ్మడి జిల్లాలోని 28 మండలాల్లో 165 గ్రామాల ఎంపిక
- భద్రాద్రి జిల్లాలో రూ.1,355 కోట్ల అంచనాతో అభివృద్ధి ప్రణాళిక
- ఖమ్మం జిల్లాలో నివేదికను సిద్ధం చేస్తున్న అధికారులు

భద్రాచలం: వెనుకబాటుకు గురైన గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. విజన్-2030 పేరుతో గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక రూపొందించింది. ప్రజలను, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేస్తూ ఆదికర్మ యోగి అభియాన్ పథకం తెచ్చింది. దీని కింద భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 28 మండలాల్లో 165 గ్రామాలను ఎంపిక చేసింది. ఇప్పటికే నివేదికలను సిద్ధం చేసిన అధికారులు ఎన్నికల కోడ్ అనంతరం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు అందజేయనున్నారు.

28 మండలాలు.. 165 గ్రామాలు

సేవా, సంకల్పం, సమర్పణం నినాదాలతో ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, స్వయం ఉపాధి కల్పించనున్నారు. మొదటి ఫేజ్‌లో ఖమ్మం జిల్లాలో 9 మండలాల్లో 35 గ్రామాలకు అవకాశం కల్పించగా, 91,482 గిరిజనులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 19 మండలాల్లో 130 గిరిజన గ్రామాల్లో 1,37,108 మంది గిరిజనులు పథకం పరిధిలోకి రానున్నారు. కొత్తగూడెం, మణుగూరు మున్సిపాలిటీలను, భద్రాచలం పట్టణాన్ని ఈ పథకం నుంచి మినహాయించారు.

భద్రాద్రి జిల్లాలో రూ.1,355 కోట్లతో ప్రణాళిక

గిరిజన గ్రామాన్ని ప్రాతిపదికగా తీసుకుని ప్రణాళిక రూపొందించారు. ప్రతీ గ్రామంలో ఆది సేవా కేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన 20 మందిని సభ్యులుగా గుర్తించి సాతి, సహయోగిలను ఎంపిక చేశారు. జిల్లా, మండల, గ్రామాల్లో ట్రైబల్ వెల్ఫేర్, విద్య, వైద్య, రూరల్ డెవలప్‌మెంట్, శిశు సంక్షేమ శాఖకు చెందిన అధికారులను సభ్యులుగా నియమించారు. అధికారులు సాతి, సహయోగిల భాగస్వామ్యంతో ప్రతీ గ్రామంలో రచ్చబండ, గ్రామంలో నడక ద్వారా సమస్యలను గుర్తించారు. గ్రామ కార్యాచరణ ప్రణాళిక నివేదికను సిద్ధం చేశారు. ఆ గ్రామ అడవి, జలవనరులు, మౌలిక సదుపాయాల తదితర అంశాలకు ప్రణాళికలో చోటు కల్పించారు. భద్రాద్రి జిల్లాలో 130 గ్రామాల్లో సుమారు రూ.1,355 కోట్ల నిధుల అవసరాన్ని గుర్తించారు. ఖమ్మం జిల్లా అధికారులు తుది నివేదికను అందజేయాల్సి ఉంది.

నివేదికలు సిద్ధం



జిల్లా, మండల, గ్రామాల స్థాయిలో మాస్టర్ ట్రైనింగ్ పూర్తి చేశాం. గ్రామాల్లో పర్యటించి నివేదికలను సిద్ధం చేశాం. నివేదికలు గ్రామసభల్లో ఆమోదం పొందాక జిల్లా లెవల్ రివ్యూ మీటింగ్ అనంతరం అప్రూవల్‌కు పంపిస్తాం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ కారణంగా ఈ ప్రక్రియ ఆగిపోయింది. కోడ్ ముగియగానే ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికలను అందచేస్తాం.

–డేవిడ్‌రాజ్, ఏపీఓ జనరల్, భద్రాచలం ఐటీడీఏ

విజన్-2030 ద్వారా..

కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి గిరిజన గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక వసతులను కల్పించాలని భావి స్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి నివేదికలను అందగానే నిధులను విడుదల చేసే అవకాశం ఉంది. ప్రతీ గ్రామానికి ఐదేళ్ల కాలంలో సుమారు రూ.2కోట్ల ఖర్చు చేయనున్నట్లు తెలుస్తోంది. అధి కారులు మాత్రం గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులపై స్పష్టమైన వివరాలతో నివేదికలను రూ పొందించారు. అంతర్గత రోడ్లు, చెక్‌డ్యాంలు, తాగు, సాగు నీరు వసతులు, విద్యుత్, ఇళ్ల నిర్మా ణం, బోర్లు తదితర అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.

క్లుప్తంగా

రైతులకు యూరియా కష్టాలు



యూరియా కోసం సొసైటీ కార్యాలయం వద్ద వేచి ఉన్న రైతులు

పినపాక: రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారు. బుధవారం మండల పరిధిలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం ఎదుట యూరియా బస్తాలు కోసం రైతులు బారులుదీరారు. ఒకరికి ఒక యూరియా బస్తా ఇవ్వడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేటీపీఎస్ కాల్వలో మొసళ్ల సంచారం



కాల్వ ఒడ్డున ఉన్న మొసలి

పాల్వంచ: మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్ నుంచి కేటీపీఎస్‌కు నీళ్లు వచ్చే కాల్వలో మొసళ్లు సంచరిస్తున్నాయి. రిజర్వాయర్ నుంచి మొసళ్లు కాల్వలోకి వస్తున్నాయి. సుమారు పది కిలోమీటర్లు ఉండే ఈ కాల్వలో అక్కడక్కడ ఒడ్డుకు చేరి, పరిసరాల్లో సంచరిస్తుడటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మంగళ, బుధవారాల్లో కరకవాగు రోడ్‌లోని కాల్వలో మొసళ్లు కనిపించాయని స్థానికులు తెలిపారు.

ఉద్యాన కళాశాల విద్యార్థుల సందర్శన



గ్రామ రైతులతో ఉద్యాన కళాశాల విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అచ్యుతాపురం గ్రామాన్ని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మోజెర్ల ఉద్యాన కళాశాల విద్యార్థులు రూరల్ హార్టికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించి పంట పొలాలకు వినియోగించే రసాయనిక ఎరువులు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉద్యాన పంటలకు వినియోగించే రసాయనాలపై ఉండే గుర్తుల గురించి రైతులకు వివరించారు. పిచికారీ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన కళాశాల విద్యార్థులు శివ, సత్యసాగర్, అభినవ్, అజయ్, నేతాజీ, యశ్వంత్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పాల్వంచరూరల్: అక్రమంగా కిన్నెరసాని వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రెడ్డిగూడెం నుంచి రాజాపురంవైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్‌చేశారు. ట్రాక్టర్ డ్రైవర్, ఉప్పుసాక గ్రామానికి చెందిన పెరుమాళ్లపల్లి నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

మేకలు చోరీ

పాల్వంచరూరల్: వేర్వేరు గ్రామాల్లో ఒకే రోజు 8 మేకలను అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధి మొండికట్ట గ్రామంలో సంపంగి వెంకటేశ్వర్లు ఇంటి పక్క దొడ్డిలో ఉన్న ఐదు మేకలను ఈ నెల 6వ తేదీ రాత్రి సమయంలో దొంగలు అపహరించారు. అదే రోజు రాత్రి మండల శివారు గ్రామమైన మామిడిగూడెంలోని ముక్కటి మల్లయ్యకు చెందిన మూడు మేకలను దొంగలు ఎత్తుకెళ్లారు. బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

టీజీ ఎఫ్‌డీసీ వాచర్‌పై దాడి

ములకలపల్లి: అటవీ అభివృద్ధి సంస్థ (టీజీ ఎఫ్‌డీసీ) వాచర్ అల్లూరి శ్రీనివాస్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. బాధితుడు శ్రీనివాస్ కథనం ప్రకారం.. గొల్లగూడెం (కమలాపురం క్రాస్ రోడ్) వాచర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ మండలపరిధిలోని మాధారం గ్రామంలో నివసిస్తున్నాడు. బుధవారం రాత్రి తన ఇంటి ముందు ఫోన్‌లో మాట్లాడుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు విచక్షణారహితంగా దాడి చేశారు. కుటుంబీకులు, సమీపస్తులు గమనించి వచ్చేలోగా అక్కడి నుంచి పరారయ్యారు. శ్రీనివాస్ తలకు బలమైన గాయం కావడంతో మంగపేట పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స పొందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఎస్.మధుప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400

ఇంతింతై.. వనమంతై !

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు

- 48వేల ఎకరాల నుంచి 1.22లక్షల ఎకరాలకు చేరిక
- అనుకూలిస్తున్న నేలలు.. ఇక్కడే పరిశ్రమలు
- సాగులో రాష్ట్రంలోనే అగ్రస్థానాన ఉమ్మడి ఖమ్మం



జిల్లాలో ఆయిల్ పామ్ సాగు, పంట

ఖమ్మంవ్యవసాయం: ఆయిల్ పామ్ విస్తీర్ణం ఉమ్మడి జిల్లాలో ఏటేటా పెరుగుతోంది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలకు తోడు అనుకూలిస్తున్న వాతావరణం, అందుబాటులో ఫ్యాక్టరీలు ఉండడం సాగు పెరగడానికి ఊతమిస్తోంది. సాగు విస్తీర్ణాన్ని పెంచాలని గత రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా.. రాష్ట్రంలోని 27 జిల్లాల్లో అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. దీంతో జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అధికారులు అవగాహన కల్పిస్తుండడంతో రైతులు కూడా ముందుకొస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు 3లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుంటే.. సింహభాగం ఉమ్మడి జిల్లాలోనే ఉండడం విశేషం.

ప్రభుత్వం నుంచి రాయితీలు

ఆయిల్‌పామ్ మొక్కలను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేయడమే నాలుగేళ్ల పాటు అవసరమైన ఖర్చులను అందిస్తోంది. రూ.193 విలువైన మొక్కను కేవలం రూ.20కే అందిస్తున్న ప్రభుత్వం ఏటా నిర్వహణ ఖర్చుల కింద ఎకరాకు రూ.4,200 రైతులకు చెల్లిస్తోంది. అలాగే, డ్రిప్ పరికరాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ, సన్నకారు రైతులకు 90శాతం, ఇతర రైతులకు 80శాతం సబ్సిడీపై అందిస్తున్నారు. మొత్తంగా ఎకరాకు రూ. 50,918 రాయితీ అందుతోంది. ఇక ఆయిల్‌పామ్ సాగుతో 30 ఏళ్లపాటు ఆదాయం లభించనుండడం.. ప్రకృతి వైపరీత్యాలు, కోతుల సమస్య లేకపోవడంతో రైతులు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు.

ఐదేళ్లలో 75వేల ఎకరాలు

ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా అగ్రస్థానాన నిలుస్తోంది. భద్రాద్రి జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటల్లో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యాన రెండు పరిశ్రమలు కొనసాగుతున్నాయి. అలాగే, ఖమ్మం జిల్లాలోని వేంసూరు, కొణిజర్ల మండలాల్లోనూ ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోంది. ఉంది. అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, మధిర, పాలేరు, ఖమ్మం ఉద్యాన డివిజన్లలో పంట సాగు విస్తీర్ణం అధికంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో 2019-20 వరకు 11,913 మంది రైతులు 48,296.19 ఎకరాల్లో పంట సాగు చేయగా.. 2025-26 సెప్టెంబర్ నాటికి 31,196 మంది రైతులు 1,22,351.34 ఎకరాల్లో పంట సాగు చేస్తుండడం విశేషం. తద్వారా ఐదేళ్ల కాలంలో ఆయిల్‌పామ్ సాగు 74 వేల ఎకరాలు పెరిగినట్లయింది.

ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు వివరాలు

సంవత్సరం	ఖమ్మం		భద్రాద్రి	
	రైతులు	ఎకరాలు	రైతులు	ఎకరాలు
2019-20వరకు	1,897	8,232.67	10,016	40,063.5
2020-21	313	1,417.10	686	2,976.19
2021-22	700	3,009.03	1,013	4,237.50
2022-23	2,756	11,427.11	3,961	16,508.36
2023-24	1,255	4,605.025	2,402	8,953.00
2024-25	1,680	5,620.00	1,535	5,464.93
2025-26	1,858	6,034.40	1,124	3,802.50
మొత్తం	10459	40,345.34	20,737	82,006

ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు



సుదీర్ఘకాలం ఆదాయాన్ని ఇచ్చే పంట కావడం, జంతువులు, చీడపీడల సమస్య లేకపోవడంతో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహకాలూ అందుతున్నాయి. ఇక్కడే ఫ్యాక్టరీలు ఉండడంతో సాగు పెరుగుతోంది.

– ఎం.వీ.మధుసూదన్, ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి

ప్రభుత్వ ప్రోత్సాహంతో...



ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మొక్కలు, ఇతర పెట్టుబడి కూడా అందిస్తోంది. ఇతర పంటల సాగుతో పోలిస్తే ఆయిల్ పామ్ మేలని గుర్తించా. భవిష్యత్‌లో మరింత డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం 15ఎకరాల్లో మొక్కలు నాటా.

–లక్కినేని శ్యాంమోహన్, పెగళ్లపాడు, టేకులపల్లి మండలం

అధికంగా వర్షపాతం, పంటలు..



లక్ష్మీదేవిపల్లి మండలంలో సాగు చేసిన వరిపంట

- సాధారణం కంటే 23.8 శాతం ఎక్కువ వర్షపాతం
- వానాకాలంలో సాధారణం కంటే అధిక విస్తీర్ణంలో సాగు
- మిర్చి సాగుకు విముఖత చూపిన రైతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వానాకాలం సీజన్‌లో అధిక వర్షపాతం నమోదైంది. జూన్ మాసం నుంచి ఇప్పటివరకు 23.8 శాతం అధికవర్షపాతం నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. జిల్లా సరాసరి సాధారణ వర్షపాతం 1,007 మి.మీ నమోదు కావాల్సి ఉండగా 1,246.4 మి.మీ వర్షపాతం నమోదైంది. 14 మండలాల్లో అధిక వర్షపాతం, 9 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

అధికవర్షపాతం నమోదైన మండలాలు

చర్ల, మణుగూరు, గుండాల, ఇల్లెందు, టేకులపల్లి, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, అశ్వారావుపేట మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. కరకగూడెం, పినపాక, దుమ్ముగూడెం, అశ్వాపురం, ఆళ్లపల్లి, బూర్గంపాడు, భద్రాచలం, ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.


అధిక విస్తీర్ణంలో పంటలు..

వానాకాలం సీజన్‌లో సాధారణ విస్తీర్ణం కంటే రైతులు అధికంగా పంటలు సాగు చేశారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 5,91,714 ఎకరాలు కాగా 6,13,702.43 ఎకరాల్లో సాగు చేశారు. అందనంగా 21,988 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వేరుశెనగ అంచనా కంటే తక్కువ సాగు కాగా కూరగాయలు, మిర్చి అతితక్కువగా సాగు చేస్తున్నారు. వరి, పత్తి, కంది, మొక్కజొన్న, ఆయిల్‌పామ్ పంటలు అధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి.

వానాకాలం సీజన్‌లో సాగైన పంటలు (ఎకరాల్లో)

పంట	సాధారణ విస్తీర్ణం	సాగైన విస్తీర్ణం	సాగు తేడా
వరి	1,64,662	1,72,625	7,963
పత్తి	2,03,560.36	2,14,859.76	11,299.40
మొక్కజొన్న	85,827	96,864	11,037
పెసర	128	388	260
మినుము	840	1,599	759
కంది	1,135	1,883.2	748.2
వేరుశెనగ	2,736	2,158	-578
జీలుగ	5,365	9,435	4,070
జనుము	353	414	61
ఆయిల్‌పామ్	63,485	77,500	14,015
మిర్చి	10,283	3,169	-7,114
పండ్లు, ఇతరాలు	9,995	10,012	17
కూరగాయలు	491	50	-441
ఆగ్రో ఫారెస్ట్రీ	28,414	29,515	1,101
ఇతరాలు	14,439	2,665	-11,774
మొత్తం	5,91,714	6,13,702.43	21,988

ఉరివేసుకుని పీఈటీ ఆత్మహత్య



చుంచు కృష్ణ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామానికి చెందిన చుంచు కృష్ణ (46) అశ్వారావుపేట మండలం కావడిగుండ్ల ఆశ్రమ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం స్వగ్రామంలోని తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై విధులకు వెళ్లకుండా ఇంటివద్దే ఉంటున్న భర్త కృష్ణ తనతో గొడవపడి ఇంట్లో ఉరివేసుకున్నాడని భార్య యశోద పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కొమరారం ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా కృష్ణ వాలీబాల్ క్రీడలో రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారుడిగా రాణించాడు. పలువురికి శిక్షణ ఇచ్చాడు.

జిల్లాస్థాయి క్రీడలు షురూ..



క్రీడల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రకాశంలో 69వ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడా పోటీలను బుధవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ చూపాలని సూచించారు. కాగా బుధవారం అండర్–17 విభాగంలోని బాలబాలికలకు పోటీలు నిర్వహించారని, గురువారం అండర్–14 విభాగంలో పోటీలు నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వాసిరెడ్డి నరేష్ కుమార్ తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి, డీసీఈబీ సెక్రెటరీ నీరజ, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, యనమదల వేణుగోపాల్, యుగంధర్, స్టెల్లా, కవిత, వీరన్న, కృష్ణ, పామర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలన

ప్రకాష్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సందర్శించి పరిశీలించారు. హాజరు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పర్యవేక్షణ, విద్యా కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. చిన్నారులను ఎత్తుకుని ఆడిపించారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఆర్టీసీ లక్కీ డ్రా విజేతల ఎంపిక

డ్రా తీసిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



విజేతలను ప్రకటిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: బతుకమ్మ, దసరా సెలవుల్లో రీజియన్ వ్యాప్తంగా ఆర్టీసీ డీలక్స్, సూపర్‌లగ్జరీ, రాజధాని, లహరి బస్సుల్లో ప్రయాణించిన వారి నుంచి విజేతలను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ప్రయాణికులు తమ వివరాలతో టికెట్లను డిపోల వారీగా బాక్సుల్లో వేయగా ఏడు డిపోల టికెట్లను ఖమ్మం తీసుకొచ్చి కొత్త బస్టాండ్‌లో బుధవారం డ్రా తీశారు. రీజినల్ మేనేజర్ సరిరామ్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి లక్కీ డ్రా ముగ్గురు విజేతలను ప్రకటించారు. ఖమ్మం డిపో నుంచి రాజధాని బస్సులో ప్రయాణించిన కాంతారావు, భద్రాచలం డిపో సూపర్‌లగ్జరీ బస్సులో ప్రయాణించిన సాయిబాబా, మణుగూరు డిపో నుంచి డీలక్స్ బస్సులో ప్రయాణించిన పి.సునీల్‌ను ఎంపిక చేయగా, వీరికి హైదరాబాద్‌లో బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ ఆర్‌ఎం వి.మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్, సెక్యూరిటీ అధికారి కోటాజీ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ వన్ పరీక్షల్లో గోల్‌మాల్



సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ పెరిగిందని, 2 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని, గ్రూప్–1 పరీక్షల్లో గోల్‌మాల్ జరిగిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి విమర్శించారు. జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి, వైఎస్ హయాంలో ప్రారంభమైన ఆరోగ్యశ్రీ పథకానికి, 108 సర్వీసులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్‌ను భూస్థాపితం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ మంత్రి కాకుండా వాయిదాల మంత్రిగా, వాటాల మంత్రిగా ఘనత సాధిస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 55 సార్లు ఢిల్లీ తిరగడానికి రూ. 200 కోట్లు ఖర్చు చేశారని, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు మాత్రం విడుదల చేయడం లేదని ఆరోపించారు. తెలుగుదేశంలో ఉండి ఆ పార్టీని భూస్థాపితం చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు కాంగ్రెస్‌ను భూస్థాపితం చేసేందుకు కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. విద్యాశాఖ రాష్ట్ర ముఖ్యమంత్రి వద్దే ఉన్న నేపథ్యంలో తక్షణమే పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సంకుబాపన అనుదీప్, తొగరు రాజశేఖర్, కర్నే మురళి, పూల రవీందర్, మునీర్, పోతురాజు రవి, భూపతి శ్రీను, జయరామ్, ఎల్. రమేష్, రిజ్వాన్ పాల్గొన్నారు.

11న అండర్–19 హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 బాలబాలికల హ్యాండ్‌బాల్ జట్లను ఈ నెల 11న ఎంపిక చేయనున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపిక పోటీలు జరుగుతాయని జిల్లా క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసా కలీం తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు కళాశాల గుర్తింపు కార్డు, ఎస్సెస్సీ మెమో జిరాక్స్ తీసుకురావాలని సూచించారు.

సర్వే నంబర్ల మాయాజాలం

- అసైన్డ్ భూములకు పట్టా సర్వే నంబర్లు
- ఆపై యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు



గాడిదల వాగు బ్రిడ్జి కింద నింపుతున్న మట్టి

సత్తుపల్లి: అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమార్కుల లీలలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. సత్తుపల్లి రెవెన్యూ పరిధితో పాటు అయ్యగారిపేట రెవెన్యూలో పట్టా భూముల సర్వే నంబర్లను అసైన్డ్ భూములకు వేసి దర్జాగా రిజిస్ట్రేషన్లు చేయించడం వెనుక ఓ ముఠా ఉన్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ల సమయాన అధికారులు పట్టా నంబర్లు ఉండడంతో చకచకా పని పూర్తిచేస్తున్నారు. అయితే, ఈ మా యాజాలంలో అధికారుల పాత్రపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏదిఏమైనా అక్రమార్కుల తీరుతో అసైన్డ్, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులు వివాదాస్పద భూములను కొనుగోలు చేసి రికార్డుల్లో మార్పులు, చేర్పులు చేసి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఒకే నంబర్ అన్నింటికీ..

సత్తుపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 166లో పట్టా భూమి ఉంది. అయితే, చుట్టుపక్కల ఉన్న ప్రభు త్వ, అసైన్డ్ భూములకు సైతం ఇదే సర్వేనంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు తెలిసింది. దీంతో సర్వే నంబర్‌లోని భూమి కంటే అధిక విస్తీర్ణం నమోదవుతుండగా.. భవిష్యత్‌లో వాస్తవ పట్టాదారులకు ఇబ్బంది ఎదురయ్యే అవకాశముంది. ప్రభుత్వాలు దళితులు, బీసీలకు పంపిణీ చేసిన అసైన్డ్, ప్రభుత్వ వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి నట్లు సమాచారం. ఇందులో భాగంగానే అయ్యగారిపేటలోని సర్వే నంబర్ 38/ఊలో జొన్నలగడ్డ పున్నయ్యకు చెందిన అసైన్డ్ భూమిని సమీప వెంచర్ యజమానులు తప్పుడు సర్వే నంబర్‌తో ఆక్రమించినట్టు పున్నయ్య వారసుడు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చడానికి మరో ఎత్తుగడ కూడా వేస్తున్నట్లు సమాచారం. ఏదైనా రెవె న్యూ పరిధిలో రైతుకు భూమి కన్నా రికార్డుల్లో అదనంగా నమోదై ఉంటే ఆ భూమిని రికార్డులో ఎక్కించి అదే సర్వే నంబర్‌తో విక్రయాలు చేస్తున్నట్లు తెలిసింది.

గాడిదల వాగు అన్యాక్రాంతం

సత్తుపల్లి శివారు కాకర్లపల్లి రోడ్డులో గాడిదల వాగు అన్యాక్రాంతమవుతోంది. తామర చెరువు నుంచి అలుగు పోసుకొని గాడిదల వాగు మీదుగా ప్రవాహం వేశ్యకాంతల చెరువుకు వెళ్తుంది. దీనికోసం 40 మీటర్ల వరద కాలువను సైతం రైతులు స్వచ్ఛందంగా వదులుకున్నారు. అయితే, ఇక్కడ బ్రిడ్జి చిన్నగా ఉండడంతో వర్షాకాలంలో తరచూ వరద పోటెత్తి రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. దీంతో తుమ్మల నాగేశ్వరరావు ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఐదు కానాలతో హైలెవల్ బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి పక్కన ఉన్నవి పట్టా భూములు కావటంతో బ్రిడ్జి కానాలను మట్టితో పూడ్చేస్తున్నారు. ఒకవేళ పట్టా భూములైనా వ్యవసాయానికే ఉపయోగించాలని, ఎఫ్‌టీఎల్‌కు మించి భూములను మట్టితో చదును చేయడం చట్టవ్యతిరేకమని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా హైలెవల్ బ్రిడ్జి నిర్మించినా రోడ్డుపైకి వరద చేరుతూ కాకర్లపల్లిరోడ్డు తదితర ప్రాంతాలు మళ్లీ ముంపునకు గురవుతున్నాయి. అలాగే, సత్తుపల్లి నలు దిక్కుల పూర్వకాలంలో ఉన్న నాలుగు నీటి కుంటలు సైతం అన్యాక్రాంతమైనట్లు తెలుస్తోంది.

బోటుగూడెంలో పోడు వివాదం



ఆవేదన వ్యక్తం చేస్తున్న పోడు సాగుదారులు

పినపాక: మండలంలో పోడు భూముల లొల్లి మళ్లీ మొదలైంది. బోటుగూడెం పంచాయతీ బందగిరినగరంలో పోడు భూముల వ్యవహారం అటవీ శాఖ అధికారులు, పోడు సాగుదారుల మధ్య వివాదంగా మారింది. అధికారులు పోడు భూముల చుట్టూ ట్రెంచ్ కొట్టడానికి సిద్ధమవ్వగా సాగుదారులు అడ్డుకున్నారు. 20 ఏళ్లుగా తాము భూములను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. సీపీఎం కన్వీనర్ నిమ్మల వెంకన్న, కాంగ్రెస్ నాయకులు అక్కడకు చేరుకుని అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం పోడు సాగుదారులకు అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. వివాదంపై ఫారెస్ట్ రేంజర్ తేజస్విని వివరణ కోరగా.. ఫారెస్ట్ పరిధిలో ఉన్న భూముల్లోనే ట్రెంచ్ కొడుతున్నామని, పట్టాలు పొందిన భూముల జోలికి తాము వెళ్లడంలేదని తెలిపారు.

పిడుగుపాటుకు గుడిసె దగ్ధం

ములకలపల్లి: పిడుగుపాటుకు గుడిసె దగ్ధమైన సంఘటన మూకమామిడి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన పుప్పాల ములకేశ్వరరావు, వేణి దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం పనికి వెళ్లగా, సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో ఇంటిపై పిడుగు పడింది. దీంతో గుడిసె, గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.